# వేదమూర్తులు

'ఇలా బ్రతికేకన్న, చిన్నం ఎత్తు విషం పుచ్చుకుని'

ఆ దీవన మొదసారి తగిలినప్పుడు...అలాగే చేస్తే మేలనిపించేటంత అసహ్యం వేసుకొచ్చింది, సంసారంమీద: కాని అస్తమానమూ అదే పదేపదే అయితే అలవాటు కావడం ఎంతసేపు ?

రెండో తారీఖు ఉదయం—

తానే ఎన్నటికైనా అంత ప్రఖ్యాతికి వచ్చి, ఆత్మ కథ! వ్రాసుకునే యోగమంటూ ఉంటే, తప్పకుండా ఆ తారీఖుకు బంగారు మలామా చేయిస్తాడు. నిజంగా అది అంత సుదినం.

కొత్తనాటకంకదా పోని అని, కోడికూసే వేళ అయినా నిదుర చంపుకుని కూర్చుని ఏకబిగిని 'ఆసాంతమూ'

చూసి అప్పుడు వచ్చి మంచంమీదవాలితే, మళ్లా అదిరిపడి మేలుకునేటప్పటకి ఎంత బద్ధకంగా ఉంటుంది? అప్పుడుకూడా అందుకుతోడు ఎప్పటిపాటే మొదలైతె చిర్రూ బుస్సూ ప్రారంభం అయితే—హుఁ—దేనికైనా ఎన్నటికో ఓనాటికి అంతు అంటూ ఉండాలి!

భీమశంకరం, ఎండ చురచురలాడుతూంటే ఏలాగో అలా ఒళ్లు తెలియని నిదురలోనే ఓపికచేసుకుని, మంచంజాజి పందిరి క్రిందనుంచి నీడకు కాలితో నెట్టి, మళ్ళా సాగిలపడీ అప్యాయనంగా ఒళ్లు విరుచుకుంటూ...యీమారు ఒకటోరకం నిదుర పట్టేది. కాని కన్ను మూశాడో లేదో, చెవిక్రింద రణ భేరి మ్రోగింది.

నిజంగా ఎంతో బద్ధకంగా ఉంది; కాని అనుకుని ఏం ప్రయోజనం? - అలాగే లేచి, ఆమె అజమాయిషీలో ముఖం కడుక్కుని - అవునుమరి, అన్నిసార్లూ పుక్కిలించక పోతే, అనాచారంకాదూ, తరతరాల పెద్దలూ తగులపడి పోరూ? ఆ కషాయాన్నే కాఫీగా భావించుకుంటూ గొంతులో పోసుకుని, పక్కార్ఘూముకు మడికట్టుకుని అన్నంముందు కూర్చున్నాడు.

అదిఅంతా రోజూ నడిచే కలాపమే కనుక అందులో చీదర కనిపించడం మానేసి చాలకాలమైంది. కాని, యిది...

'ఎందుకూ అలా దిక్కులు చూస్తూ కూర్చుంటారు? నాముఖాన ఏముంది?'

—ఆమాటకు నవ్వురాదూ!

'ఏం చూసుకు ఆ పొంగిపోవడం ?'

'ఇంకా మరెవరిని చూడ్డం ?'

'ఎందరినన్నా చూడగల సామంతం ఉంది ! నా కంఠం కోయడానికి ఎన్ని ప్రశ్నలు కావాలో అన్నీ ఉన్నాయి మీకు; మీరుకాగా దొరక్కపోతారేమోనని మా నాన్న నాకీ పట్నం కట్టాడు, బావుకుంటున్నాను.'

'ఏం మాటలవి ?'

'మీ బుద్ధుల కొద్దీని ! ఏం ఒరగబడుతుందని చూడ బోయినారు, వాళ్లెవరో తెగించి తెయితక్క లాడుతూంటే ! ఆ సౌభాగ్యం తలచుకునేనా యీ విరగబాటంతా ! ఇలాటి వాళ్ళు పెళ్లి ఎందుకు చేసుకోవాలి ? ఎందుకంట ?'

—అలా ఆమాటలు వింటూన్నకొద్దీ నవ్వు పొంగి రాదూ ?

'అందుకే నాకు దహించుకుపోయేది ! నా బ్రతుకంతా నవ్వులపాలుగానే చేశారు. ఇంకా ఎందుకా యికిలింపు!'

'మానేస్తాను పోనీ, యివాళనుంచీ.'

'ఎంతకన్నా సాహసులే.'

'ఏం చేయమంటావు ?'

'నేనేం చేయమంటాను ? చేయమన్నది మీరేం చేస్తారు ?'

'నిజమే !'

'మీఅమ్మకడుపు చల్లగా నా ఆయుస్సుకూడా పోసుకుని వర్ధిల్లండి. అవును, నేనే గంగలో దిగితేనేం, మీ జీవా

నికి ఉసూరుమంటూ! మీకు అచ్చిరాదు; అయినింటి పిల్లను...కావాలని...తెచ్చుకుని...యింత—'

...అప్పుడు యిక విరగబడకుండా ఉండేందుకేమన్నా వీలుందా ?

రాజమ్మ పెరుగు సత్తుతప్పాలా, గరిటా క్రిందపడేసి పైటకొంగు కళ్లకు ఉరివేసుకుని, వెక్కి వెక్కి ఏడుస్తూ లోపలికి వెళ్లిపోయింది. అది మామూలు మర్యాదే...

భీమశంకరం విస్తరి విడిచిపెట్టి లేచి చేయికడుక్కొని సావడిలోకి వచ్చాడు నిలువుగుడ్డలతో—కృష్ణుడి పటంలో వెన్నముద్ద బొమ్మను పిచ్చిక ముక్కుతో టక్కు టక్కు పొడుస్తూంది.

ఇంకా రోదనం శ్రుతిమించే ఉంది. వింటూన్నకొద్దీ జాలిపెరిగి; లోపలికిపోయి, దగ్గిరగా నిలుచుని భుజంమీద చెయివేసి చూశాడు. రాజమ్మ విదిలించుకుని అంతమెత్తున ఎగిరిపడి, రోజుకుంటూ 'మడి మన్నయిపోయింది' అని యినుమిక్కిలిగా స్థాయి అందుకుంది.

అప్పుడు బయలుదేరి వెళ్ళడం...మరునాడు సంజ మలిగేదాకా యింటి చాయలకన్నా పోలేదు భీమశంకరం. ఏ స్నేహితుడితోనన్నా, కలసి కాలం గడపడానికి...ఎవరికీ మొగం చూపించలేనంత సిగ్గవుతుంది. ఎందుకో—అదే తెలియదు.

తనవల్ల ఏ దోషమూ లేదని గుండెమీద చేయివేసుకుని నిబ్బరంగా చెప్పగలడు. అందరూ పడుచు దంపతుల

లాగా హాయిగా ఉండడానికి అనువుగా ఆతనిలో అంతులేనంత కులాసా ఉన్నది; కాని, ఏమిటి లోపం—ఎవరివల్ల ?

ఏమీ ఆలోచన తెగనప్పుడు...ఎవరూ చూస్తుండ నప్పుడు...తనలో తాను అదో మాదిరిగా నవ్వడం అలవాటు చేసుకున్నాడు. ఆ నవ్వే, అవసరంకొద్దీ యింటిదగ్గర ఉన్న ప్రతినిమిషమూ వినియోగించు కుంటున్నాడు. లేకపోతే...

ఎంత ఏడుపు వచ్చినా, అది మింగేసే సత్తువ తెచ్చుకో లేకపోతే। ఒక్కనాటిరగడకే నేలమట్టానికి క్రుంగిపోయి మామూలు సంసారిలాగా అయి—యిల్లు ఓ కొలిక్కి తీసుకు వచ్చినట్టయితే—ఆ బ్రతుకు అయినా ఒకవేళ యింతకన్న బాగుండేదేమో...

ఏమో—

ఎంత బొప్పికట్టింది, తల ద్వారబంధానికి తగిలి తీపు ఎత్తడం మొదలుపెట్టినా, రవంతసేపు ఓర్చుకుంటే సర్దుకుం టుంది దానంతట అదే. కాని ఎదురుగుండా...సగం వెలు తురూ, సగం చీకటిలో నిలుచుని రాజమ్మ తనవేపు గురితప్ప కుండా చూసే చూపు...?

పవలు తిప్పటంతో...తినీ తినకుండా పోవడంలో క్షుత్తు పూర్తిగా మందగించిపోయింది. ఆ పూటకు అన్నం ఆశలేదు. శుభ్రంగా స్నానంచేసి నిద్రపోవచ్చునుకదా అని గుమ్మంలో అడుగు పెట్టేటప్పటికి...

అంత నిస్సత్తువా మరలించుకుని...తిరిగి వెళ్ళిపోతు న్నాడు...మూడు కాలవల వంతెనమీద...పై కమ్మీమీద

చేతులు ఆనించి, మోకాళ్లు రాతిగోడకు మోపెట్టి...రంయి మనివచ్చే చల్లనిగాలికి మోరాయించి...ఎదురైనంతసేపూ మొగమాటపడి...ఎక్కడో ఎవరూ చూడనిచోట కలుసుకోవాలని పక్క పక్కల పరుగులుగా ప్రవహించే కాలువలు కనుచూపు మించేదాకా చూస్తూ...ఏమీ ఆలోచన లేక ఎంతోసేపు నిలుచున్నాడు...మెడ అయినా మలచకుండా.

దిగువనుంచి వస్తూన్నలారీ గేర్ మారిన ఊతంలో శరవేగం అందుకుని గట్టును 'రాచుకుంటూ ఉరవడిగా దుమ్ము విరజిమ్ముతూ పోయింది. హారన్ మోతకు భీమశంకరం ఉలికిపడి చూపు బెసకటంలో.. అలా ఎంతసేపటినుంచో పరధ్యానంలో...ఆ పరాయి ఆడదానికి అంత దగ్గిరగా నిలుచున్నానే అని...

అందుకు ఏమీ అనుకోలేదు. ఆమె ఏం అనుకున్నదో అని...అలా ఎన్నడూ అలవాటులేని అమర్యాద అప్రయత్నంగా తనవల్ల జరిగినందుకు... మెడనరాలు క్రుంగిపోయినవి. ఇక అక్కడ నిలువకుండా తన దోవను తాను పోతే ఏ యిబ్బందీ లేదు. కాని ఎవరో ఎరుగని ఆమె తనను గురించి ఏలాగో అనుకునేందుకు అవకాశం ఎందుకు ఇవ్వాలి?

ఏమనాలి?—ఏలా పలుకరించి క్షమించమని అడగాలి?- అడగాలా, వద్దా?- తుదీ మొదలూ కలిసిపోయి, అనుమానాలన్నీ ప్రశ్నలై మెదడులో చక్రవాటాన గిరగిరమంటున్నాయి - పెదవి వణకిపోతూన్నది. ఆమెవైపు పట్టు

బలవంతాన తిరిగాడన్నమాటే కాని...తలఎత్తి చూడలేదు, నోరు విప్పలేదు.

ఈ నాటకమంతా ఆమె కనిపెట్టిందో లేదో కాని, ఏమీ గమనించనట్టుగానే, అక్కడనుంచి కదిలి వెళ్ళిపోతూన్నది వంతెన దిగి, వయ్యారంగా. భీమశంకరం...తన వశం కాక, కళ్లూ కాళ్లూ ఆమెకు అప్పచెప్పాడు.

మారీస్‌పేట పెద్దరోడ్డు వెంటనే కొంతదూరం వెళ్ళి, ఎడమవైపుగా మిఠాయి కార్ఖానా ప్రక్కసందులోనుంచి సరాసరి సున్నంగానుగ దాటిపోయి, గోడకు అటూఇటూ కడపరాళ్ళ దొంతరలు సాగిలిపడి ఉండగా వాటి సందునుంచి వెళ్లి తలుపు గొళ్ళెం తీసి, ఆతనివంక పక్కకు తిరిగి ఓమారు చూసి గుమ్మంఎక్కి లోపలకు వెళ్ళిపోయింది.

సంజె చీకటి, మసక హెచ్చుతూంది. దీపాలు ఇంకా వెలుగలేదు కనుక, కనుచూపుమేర అంతా, అలికివేసినట్లుగా...కదిలే మనుష్యుల ఆకారాలు మాత్రం ఛాయగా కనబడుతూన్నాయి.

భీమశంకరం కొంచెం ఎడంగా సందుమొగుదల నిలుచుని ఉన్నాడు...ఆ ఉనికికి అర్థం ఏమీలేదు. ఎందుకు వచ్చాడో తెలుసును గనుకనా ?- ఇంకా ఎక్కడనో ఉంది?

ఆమె మళ్ళా గుమ్మం అవతలనుంచి తీరుబడిగా తొంగి చూసి, తల కదల్చినట్టు ఆతనికి చూచాయగా పొడగట్టింది. తలుపు కిర్రుమని అటూ ఇటూ ఆడి విసురుగా దభేలుమని కమ్మీకి ప్రమోగింది.

3673



—వంచిన తల ఎత్తకుండానే తిన్నగా వెళ్ళి...లోపల ప్రవేశించాడు. అంతకుముందు ఆమె వెంటపడి రావడంలో ఉద్దేశం వేరు. అక్కడకు వచ్చేదాకా కూడా అది మారే వ్యవధి కలుగలేదు, మనసుకి. అంతవరకూ, ఆమె ఎవరై యుండునా అనే యోచనే పోలేదు. అలా, మళ్ళా తొంగి చూడగానే...ఓహో— అనుకున్నాడు.

అసలు దినవ్యవహారంలో అయితే, ఆలాటి చాయలకు పోవాలసిన అగత్యము లేదు...అలవాటూ కాలేదు...అసహ్యం పైగాను. కాని, అవాళ...తనలో ప్రళయంగా చెలరేగే రాక్షస - తాండవానికి...అవును అవసరం వచ్చినప్పుడు ఏ ఎండకు ఆ గొడుగు పట్టాలి.

వసారాకు సగందాకా అల్లిక వదులైన తడిక అడ్డం కట్టిఉంది. ఆ చాటుగా...మాసినదుప్పటీ, మంచం. గోడ కలుగులో అటూఇటూ వెలుతురుకోసం అద్దంచాటున దీపం. కుర్చీకి ఒక కాలు లేదు. దాన్ని గోడుగా ఊతం చేసుకుని, భుజాలకు అంటే గిల్టు లోలాకులు ఊగించుకుంటూ, చేరెడు వెడల్పు అంచుచీరె కట్టుకుని...కుచ్చెళ్ళమీద చెరగని తాంబూలం కర్రులు సర్ది దాచుకుంటూ...ఆమె నిలుచుని...ఆతను రావడం చూసి...అన్ని జతల బిళ్లేరిగాజులూ గలగల మనేటట్టు చేయి పైకెత్తి ముంగురులు సవరించుకుని...కాలు జూచి తడికతలుపు దగ్గిరగా నెట్టింది...

కథా నిలయం
3673

'కూర్చోండి'... మొగస్నేహితుడికన్నా చొరవతో, చేయిపుచ్చుకుని...మంచం చివరను కూర్చోవేసింది. తాను గోడకు ఆనుకుని నిలుచుని ఉంది.

భీమశంకరం తలలో నిప్పులు చెరుగుతూన్నాయి... ఉక్కిరి బిక్కిరిగా ఉంటే...చెమటలు దిగజారుతూండగా... మెడగుండీలు విప్పుకున్నాడు...

'నా పేరు...నవమల్లిక'.

ఆ మాటకు ఒక్కసారి ఆతనికి తలదిమ్మంతా హరించిపోయి...నలుమూలలా చూసి...ఆ మెమీద చూపు నికరంగా నిలిచి...నవ్వు వచ్చింది. జేబులో...గలగల మనిపించి... రెండురూపాయలు ఆమెకు బొత్తిపెట్టి అందించాడు. ఆమె చిరుతలు వాయించినట్టుగా గోరుతో వాటిని మీటి...ఒక్కొక్కటే ప్రమోగించి చూసి...అతని ఒడిలోకి విసిరివేసి...అతని కన్న ఎక్కువగా నవ్వింది.

భీమశంకరం తెల్లబోయినాడు. చాలకఅలాచేసిందేమో అనుకోడానికి ... తాను ఏమీ కోరకుండా ... ఉచితంగా అయినా అంతేనేమో ఆ జాతి !—మళ్ళా జేబులో చేయి పెడుతున్నాడు...ఆమె చటాలున చేయిపట్టుకుని ఆపి...

'అంతేనా...' అన్నది, అదేమిటో ఆతనికి అర్థం కాలేదు...

'అన్యాయానికైనా...అంతు ఉంటుంది.'

—ఆమె ఆలా నిజం చెప్పడం ఆతనికి ఆశ్చర్యం వేసింది. అసలు అదికాదు. ఆతడు పొరబడుతున్నాడని గ్రహించి...

'ప్రేమను అంగడిలో పెట్టి అమ్ముకునేవాళ్ళయినా—బాధ కావలెనంటే...కొనుక్కోవలసిందే...'అని ఎంతో జాలిగా అన్నది...మరి, ధూకుడుగా...

'నేను రోజూ అక్కడే నిలుచుంటాను...అది నాకు...జీవనం. అలా చివరగా...ఎక్కడకో అంతుకనబడకుండా పోయే ప్రవాహంకేసి చూసిచూసి...కళ్లు కాయలు కాయడమే కాని...పండు ఎన్నటికీ పండదని...నాకు తెలుసును...నాకోసం...కాచిఉండేవాళ్ళు నావంక చూడటం అదే అప్పటి ఆశకు అంతు...అందుకోసమే కాదూ బ్రతుకంతా...'

ఇందులో భీమశంకరానికి...ఒక్కముక్క అర్థం కాక పోయినా...ఆమె మాటలు వింటూంటే...అదేమిటో తగని హాయిగాఉంది. మళ్ళా ముఖం తేటబారుతూంది...

'బయట...ఎంత వెన్నెలగా ఉందో చూడండి...' ఆమె ముందు అడుగు, అతనిది వెనుక అడుగూ...

—రెండు అడుగులు వేసిన తరువాత ఆమె తప్పుకుని చీకటిలోకి కలిసిపోయింది...ఎటు వెళ్ళిందో జాడగా...సినీమా పాట ఏదో ఈలగా...మాదంగా వినబడుతూన్నది.

భీమశంకరం ... కుచ్చెళ్ళు ... ఎడమమోకాలిమీద మడతలోంచి పట్టుతప్పి...క్రిందకుజారి...అందులో అణగి

ఉన్న రూపాయలు...కాళ్లకడ...దొర్లిగిలినవి. తీసి చేత పుచ్చుకున్నాడు.

మళ్ళా వంతెనదగ్గిరకు వచ్చేటప్పటికి...ఆ వెన్నెలలో ...పసిపిల్లను పొదివి పట్టుకుని కూర్చున్న పేదరాలిముందు, చేతిలోవి...ఎదుటపరచిన చిరుగుల పాతమీద జారవిడిచి వంచిన తలఎత్తి...వెన్నెలకన్న ఎక్కువగా మెరిసే నక్షత్రం వంకచూస్తూ ... స్టేషనుకు వెళ్ళి ... స్టాలులో తాను మోయ గలిగినన్ని పుస్తకాలు ... ఆవాళే వచ్చిన కొత్తవి కొనుక్కుని తిరిగి యింటికి వచ్చేశాడు.

తలుపు ఓరవాకిలిగా వేసివుంది. కాలితో తోసి లోప లకు వెళ్లాడు. రాజమ్మ నడవలో కొంగు పరుచుకుని పడుకుని ఉంది? మరచి. అలికిడికి లేవలేదు.

—ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు...ఏ తెల్లవారు గట్లకో...

రెండో తారీఖు ఉదయం -

మంగళారావాలు చెలరేగుతూండగా తప్పనిసరిగా మెలుకువ వచ్చింది ... భీమశంకరానికి. రాజమ్మకు ఎంత సేపైందో తెల్లవారి.

—'ఏమిటీ నావంక అలా చూస్తారు?'

'ఎలా చూస్తున్నాను?'

'ఏమో నాకేం తెలుసును?'

'మీకు తెలియకపోతే...'

'తెలియకపోతేనే చూసేది.'

'అవును నే నంటే...'

'కాదు - దేవతలంటే...'

రాజమ్మ అర్థంకాక బిక్క మోహం వేసింది. భీమ శంకరం యీమారు నిర్భయంగా నవ్వాడు ... ప్రసన్నంగా ఆ మెవంకచూస్తూ.

—రెండో తారీఖు ఉదయం.

సుఖంగా, ఏ చీకూ చింతా లేకుండా, జీవితం అమరినవాళ్లకే ... ఆ ఎండ చురచురలో రోజులు చురుకుగా గడవడం సాధ్యకావడం లేదు. ఆలాటప్పుడు కాస్త పొరపాటున కను ఏమరితే చాలును కరవడానికి అన్నట్టుగా రాజమ్మ నిరంతరం...కని పెంచే ఆడపులిగా రాచుకుని కూచుండటానికి కారణం తన చల్లనైన ఏదైనా లోపము అవునో కాదో తెలుసుకునేందుకు భీమశంకరం చేస్తూన్న భగీరథ ప్రయత్నాలన్నీ ఏమాత్రమున్నూ ఫలించక, ఎప్పుడు చూసినా ఎప్పటికప్పుడు భస్మాసురులే కనులముందు దుమ్ము ధూళి ఎత్తిస్తూంటే...ఎలా సర్దుకుపోవాలో తెలుసుకునేందుకు ఓపిక ఉన్నంతసేపూ పెనుగులాడటంలోనే ఆ సంకెళ్లు సడులివ్వగానే తెంచుకు పారిపోవడానికి కాలుదువ్వడం... సామాన్యగృహస్థుకే సజావైన నడవడి అని తోచే సందర్భం అయినప్పుడు...అరచేతి మందవు ఓర్పూ అరిగి రావాకూ పాళానాకు వచ్చినతరువాత భీమశంకరానికి అలా ఆలోచన పోవడంలో ఏ మాశ్చర్యము ఉన్నది?

'నీ మనసు నీకు తెలియదా ? లేక తెలిసిచేసే పనేనా యిది ? ఇందువల్ల నీవు ఏం బావుకుందా మనుకుంటావో నాకు తెలియకుండా ఉన్నది'—అని తెంపు తెచ్చుకుని, నిలవేసి భార్యను మందలించడానికి ఉపోద్ఘాతం విప్పాడు. రాజమ్మ ఆ మాటలు వింటూ కనురెప్పలచాటున ఆశ్చర్య పడి, అది అంతలో విదిలించుకుని సహజమైన చిరాకుతో 'మీ మాటలు నా కర్థంకావడంలేదు. మావాళ్లు నాకు మీ అంత చదువు చెప్పించలేదు. మీకు చాకిరీచేస్తూ, మీచేత మాటలు పడుతూండమని... మెడకో పలుపువేసి అది మీచేతికి అందించి వెంట తోలేశారు—' అంటూ ఇక అక్కడ నిలువకుండా లోపలికి వెళ్ళిపోయి వాక్యశేషాన్ని అక్కడనుంచి అరగంటవరకూ చివవలు, పలవలు వేయించి సాగదీస్తూ...అప్పటికీ యింకా అర్ధోక్తిలోనే ఆపి ఉంచి... ఏదో పని తొందరలో అప్పటికి అది మరచిపోయింది. అవాళ నుంచి...సందు దొరికినప్పుడల్లా...మళ్ళా అక్కడనుంచి ఎత్తు కోడం...చిత్తం వచ్చినపుడు పనస ఆపడం...భీమశంకరం రెండు రోజులు ఏలాగో అంతా సహించి అంటిముట్టనట్టుగా ఊరుకుని ఇక ఆ తెల్లవారి 'నీవు రాక్షసివి. వేయి చెప్పా- లక్ష చెప్పా...అనుభవంమీద అంటున్నాను అంతే?' అని తనకు తానై నిప్పులు చెరగడానికి ప్రారంభించాడు.

'నాకు తెలియదూ ఆమాత్రం ? మీ కళ్లకు నేనంత కన్న, ఏలా కనబడుతాను ?'

'కళ్లకు మోహినిలాగా, నా మనసు కళ్లను మోసం చేసింది.'

'మనసును నమ్మనప్పుడు, కళ్లనుమాత్రం నమ్మడం ఎందుకూ? అప్పుడుకాని మీ కళ్లు చప్పగా చల్లబడవేమో?— నన్ను ఏం చేయమన్నారో చెప్పండి?'

'నే నేం చేయాలో నాకు తెలియడంలేదు. సుమతీ శతకం దగ్గరనుంచీ మనువుదాకా...అన్నీ అబద్ధాలా అనుకుందామంటే ఆడవాళ్ల అందరిలో ఆఖరుకు అధములు అనుకునే వాళ్ళలోకూడా 'దేవహాంశ' అణువణువునా కనబడుతూంటే ... నీలో అది ఎందుకు పూర్ణానుస్వారం కావాలి?'

"దేవీ-హాంశ" కాశీమజిలీకథల్లోలాగా సప్తసాగరాలూ దాటి వెళితే అక్కడ సువర్ణద్వీపంలో - ఎఱ్ఱ మఱ్ఱి తొఱ్ఱలో ఎఱ్ఱ యిఱ్ఱి ఏడు పిల్లలను పెడితే వాటిలో కడయిఱ్ఱి తొడక్రింద ఉంటుంది ... కర్కులగుఱ్ఱం ఎక్కి కదిలి వెళ్ళండి ... తెచ్చి నాలో కలపండి.'

'కష్టపడి తెచ్చి తీరా కలిపితే - విరిగి ఊరుకుంటే.'

'ఇంతకన్న చెడేది ఏముంది?'

'అంతేనా?'

'అవును - మీరన్నమాటే.'

—భీమశంకరానికి జవాబు చెప్పేందుకు నోరు మెసలకండా ఉద్రేకము వచ్చింది. మాటా ముల్లే సర్దుకుని - మారు మాటాడకుండా ఆరాత్రి మెయిలుకు ప్రయాణమై ఊటీ వెళ్లిపోయినాడు. రాజమ్మను ఒంటరిగా వదిలి వెళ్ళ

డమా అనే మీమాంస దోవలో. బండీ కుదుపు ప్రారంభం చేసింది, కాని ఆమెకు గంపెడు బలగం ఉన్నారు. అంతా సామంతులు. తెల్లవారి లేస్తే ఏదో పనిమీద ఎవరో ఒకరు బస్తీకి వస్తూనేవుంటారు, సాయానికి లోటు ఉండదు అనుకునే నిశ్చింతగా బయలుదేరాడు.

నెలగోజులు చిటికెలమీద గడచిపోయినవి. అలజడి ఏవిధంగానన్నా మరచిపోయి హాయిగా ఉండాలని చేసే ప్రయత్నాలకు, అబ్బే భోగానుభవాలలో అన్నీ విప్పిచెప్ప డానికి వీలైనవే ఉండవు. అసలు ఒక్కొక్కప్పుడు అతి రహస్యంగా ఉంచడంలోనే ఆ నూలువాసి ఆనందమూ మెలికి దక్కుతుంది. తరువాత తీరిక సమయాల్లో మనసులో వెను దిరిగి చూసుకుంటే గోరుమొన అంతే, కొండకు ఏడింతలుగా పింజ విచ్చుకుంటుంది.

కాని, భీమశంకరానికి అంత సామాన్య-సహవాస వశ మున ఆ నీలికొండలచలువ - విలువలో వీసపాలైనా అబ్బలేకపోయింది. అన్నప్పుడూ చలికి వేగుతూ - ఆకాశం వేపుకు వేడిమికి తరువుల అగ్రాలని ఉరకలెత్తించే ఆ కానరాని ఊదర ఆతన్ని తెగ ఊరించుతూన్నది. అందుకనే-'నిన్ను విడిచి ఒక్కక్షణం బ్రతుకలేను'—అనే లాలనకు అనువైనటులల్లా ఎన్ని వన్నెచిన్నెలు తీర్చో-లాభ సాటికి తమచెంతనే నిలుపుకోవాలని చూసిన శీతల-సీమంతినుల ప్రణయ-ప్రణవం అతన్ని ఏకాడికీ కమలా-కానన తపస్విగా మార్చలేక పోయింది.

ఏందుకో ఇంటిమీద అంతబెంగ? ఎందుకా అని పరి పరి విధాల ఆలోచించాడు. ఏమీ తేలదు - మైళ్ళకన్న వేగంగా-మనసు ముందుకు పరుగెత్తడంమాత్రమేకాని.

ఇన్నాళ్లూ, ఎక్కడఉన్నదీ, ఎప్పుడువచ్చేదీ ఇంటికి రెండు పంక్తులైనా వ్రాయలేదు. తీరా చేరుకునేటప్పటికి, తాళంవేసి ఉంటే ఇబ్బంది పడవలసి వస్తుందని సరంజామా అంతా స్టేషనులోనే ఉంచి, అవశిష్టాలు అన్నీ తీర్చుకుని... కడుపునిండిన తరువాత కాస్సేపు విశ్రమించి, లేచి కాఫీ పుచ్చుకుని ఇంటికి బండీ కట్టించుకున్నాడు. పవలల్లా ఎండబాగా కాసినా ప్రొద్దు వాలేముందు మబ్బు వేయడంచేత చప్పున చల్లబడి ఊరుకున్నది.

తలుపు పిలుద్దామనుకుంటూండగానే, వీధిలోకి వెళ్లబోతూ, చేత సిగరెట్టుతో బావమరిది ఎదురైనాడు. తను కంట పడటంతోనే సంతోషంగా 'ఓహో! కొత్త పెళ్లికొడుకులాగున్నావయ్యా! కుడికాలు వెయ్యి లోపల. మంచి శకునమేలే...మనకు తోడు-చేత అంటిపట్టుకుని అగ్నిహోత్రుడున్నాడు కా. బస్...రైట్ ఎబవుట్ టరన్—కాఫీ కర-కర లాడిద్దాం-సహపంక్తికి దయచెయ్యి...' అంటూ చెయ్యి అందుకున్నాడు. భీమశంకరం చెవులు మాత్రం ఆతనికి అప్పగించి...మనసు మళ్ళించుతూన్న చూపులతో రాజమ్మకోసం వెదకి...అతడు వినవంత తేలికగా నిట్టూర్పువిడిచి తల వంచుకుని అడుగుతీసి అడుగు వేశాడు.

'నేను బెజవాడ వెళ్లుతున్నాను...నాటకం' అన్నాడు. ఆ పడుచువాడు...కాఫీ గ్లాసులు ఖాళీ అయిన తరువాత సిగరెట్లకోసం వెళ్లినవాడు అవి తెచ్చేలోపుగా వచ్చి వక్క నములుతూ,

'నేనూ వస్తాను' అని భీమశంకరం ఉత్సాహంగా పట్టుపట్టాడు.

'నీవూనా...ఇవాళ ఏమంత మించిపోయిందనీ ?'

'ఎన్నిమాట్లు అనుకున్నా-చూడటం పడటంలేదు.'

'ఇంకోమారు'

'కాదు - ఈ మారే'

'మనకు - మతి అనే పదార్థం యథాస్థానాన ఉన్నట్టే లెక్క వేసుకోమన్నావా ?'

'ఉండటానికి వూడటానికి ఏం ప్రళయం వచ్చిందని ?'

'అందుకనే ప్రభూ! పసివాడిని, పరమరహస్యాలు నాకు అర్థం అయే యోగ్యత పట్టలేదుకనుక అమాయకంగా అడుగుతున్నాను...నాకూ నీకూ ఎక్కడ వంతు?- నేను వచ్చి బ్రహ్మచారి నన్నసంగతి దేవరకు విదితమేకదా ?'

'నేనూ అంతే...ప్రస్తుతం' అని అందామని, నోటిదాకా వచ్చింది కాని, భీమశంకరం పరువుకుపోయి, బలవంతాన తమాయించుకున్నాడు. ఆతడు అలా తటపటాయించడం చూసి బావమరది రేచులాగా—

'దేశాటనంచేసి తెచ్చుకున్న వేషాలన్నీ నా దగ్గిర వేద్దామనుకున్నావేం. మా యింటిపక్క తెలుగు మాస్ట

రున్నాడే ఆధీరుడు గడియారానికి బుద్ధిలేక అసలు వేళకన్న అయిదు నిమిషాలు దాటనిచ్చి యింటికివచ్చాడో...ఆవాళ ప్రొద్దుపోయేదాకా ఇక చూచుకో నారంగా, ఇక అదో ప్రణయంకాదు, విరహంకాదు...ఎంతగ్రంథం చేస్తారనీ, యింటిన పడి?- కమీషనరును స్వయంగావచ్చి విచారించి న్యాయమని తోస్తే ఆ బాధ నివారించి మమ్మలను కాపాడవలసిందిగా అర్జీ పెట్టుకుందామా అని చూస్తూన్నాననుకో?- ఇక తమ విషయంలో ఇవాళ దానికి ఎంతపెట్టి హెచ్చవెయ్యాలో? నా పుణ్యాన నాటకం అంటూవచ్చి యింట్లో ఉండకుండా బ్రతికిపోతున్నానుకాని బయట వసారాలో పక్క వేసుకుంటినో, మాటిమాటికీ మయూరుడిలాగా మా అక్కయ్యచేత శాపానికి కళ్లు పొడిపించుకుంటూ ఇంద్రుడల్లే కను - పెట్టుకున్నా - ఈపాటి చూపైనా లేకుండా పోయేవాడిని. అవునా కాదా?'

భీమశంకరానికి వింటూన్న కొద్దీ విపరీతంగా నవ్వు వస్తూంది. కాని నవ్వివేసినందువల్ల నష్టం తనకే! అసలు అంత కాలమునుంచీ గోప్యముగా...అతనికి తెలియజేయ వలసిన అవసరం రానందువల్ల తన యుద్ధాలు తాను చేసికుంటున్నాడు. అప్పుడు అబద్ధం ఆడటానికి అసహ్యాం వేసింది. అధికాపరాథం ఇంకోటి ఉండదేమో అనిపించింది. ఇద్దరికీ అరమరికలు లేవు కనుక, మర్యాదం విడిచి, బావమరదికి మనసులో మాట ఇక దాచుకోకుండా ఖాళీచేసి చెప్పేశాడు. ఆ ప్రచండకుడు అంతా సావకాశంగా విని...'అసలైన

తెలుగువాడంటే నీవే' అనడంలో, మాటలో అక్షరమక్షరము మరఫిరంగీ మొగ్గలు దూసుకుపోయే వాటంలో గుచ్చివిసిరి— వివరణకు ఉపక్రమించాడు.—

'కాలిప్సో ప్రతిపాలుకున్నదా లేదా - నన్ను విడిచి వెళ్లవద్దు; వెళ్లిమాత్రం అక్కడ ఇంతకన్న ఎక్కువబావు కుంటావుగనుకనా?'- వాడని వనలతలు, నిడమాయని వనస్ప తులు, ఎన్నడూ వసివాళ్వాడని నేను ఇంత అమర - యావ నం నీపాలు చేస్తూంటే నిలకడగా ఉండి పాలించుకో రాదా ?'— యూలిసిస్ రుచికి అంతతీపి వెక్కసమై... కదిసి ముదిసితే - ముచ్చట తీర్చుకునేందుకు...పదిసంవత్స రాలకు అన్నడో వెనుక యింటిదగ్గర మరచిపోయివచ్చిన యిల్లాలిని వెదుక్కుంటూ తెప్పకట్టుకుని బయలు దేరలా ? —అంత పెద్ద చూపువున్నా ... అంత చిన్న ఆశకు అంతుచిక్కిపోయి ... అంతటితో సరిపెట్టుకుని అదే బ్రతుకనుకోవడం .. ఆంధ్రాయ్ లక్షణం అని దివ్య చిత్త మున అవధరించి ... ఇక యింటికి_'

భీమశంకరం మేఘాలమీద తేలిపోయినాడు, యింటికి. రాజమ్మ వీధి సావడిలో కిటికీలో కూర్చుని జాజిమొగ్గలు దండకట్టుకుంటూ, అతనిరాక చూసి కిటికీ రెక్క, 'ఓరువాకిలి' చేసింది. లోపలకు వెళ్లేటప్పటికి, తలవంచుకుని నిలుచుని ఉన్నది. సమీపించి చేతులో దండ అందుకుని సిగలో తీర్చాడు. అమరిక సరిగా ఉన్నదికదా అని చూసుకునే చేతిని

ఆతడు అందుకుంటే ఆమె లాక్కో బోయినా అతడు పట్టు విడవలేదు –

రెండో తారీఖు ఉదయం...

మంగళతూర్యములు మార్మ్రోత మొదలుపెట్టినవి. భీమశంకరం మేలుకుని, కనులప్పళించుతూ పక్కదిండుమీద నలిగిన జాజిరేకల చాలుతో, బావమరది ఉపదేశ వర్ణ మాలను భావించుకుంటూ బద్ధకం ఏమీ లేకుండా – హాయిగా పక్కమీదనించి లేచి, రాజమ్మ గొంతు చెలరేగే జాడను పట్టి ఆవేపు వెళ్లాడు.